శ్రీకాకుళం నగరంలో సినీతారలు పాయల్ రాజ్‌పుత్, నేహాశెట్టి గురువారం సందడి చేశారు. ఎస్.ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన వారిని చూసేందుకు యువత తరలివచ్చారు.
- ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్

# ఇచ్చిన హామీలు అమలు చేయండి

- అంగన్వాడీల పోస్టుకార్డు ఉద్యమం
- సిఎం జగన్మోహన్ రెడ్డికి లేఖలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు గురువారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేఖలు రాశారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మడమ తిప్పకుండా ఇచ్చిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, కె.సంధ్య తదితరులు పాల్గొన్నారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలు సిఎంకు పోస్టుకార్డులు రాసి స్థానిక పోస్టాఫీసులోని పోస్టుబాక్సులో వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పోస్టాఫీసు వరకు అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లారు. అక్కడ పోస్టుబాక్సులో పోస్టుకార్డులు వేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో పోస్టుకార్డులు రాసి పోస్టుబాక్సులో వేశారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్రవర్తి రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. కొత్తూరులో పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.లక్ష్మి, హేమలత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. నరసన్నపేటలో సమ్మె శిబిరం వద్ద రాసిన పోస్టుకార్డులను ప్రదర్శిస్తూ స్థానిక పోస్టాఫీసు వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోస్టుబాక్సులో తాము రాసిన లేఖలు ముఖ్యమంత్రికి పోస్టు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.జయలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు డి.సరోజిని, పి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేపట్టారు. సిఎంకు పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత తదితరులు పాల్గొన్నారు. సోంపేటలో సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్ సంఘీభావం తెలిపారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బూర్జలో సమ్మెకు మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్ సంఘీభావం తెలిపారు.

ఇచ్ఛాపురం : సిఎంకు పోస్టుకార్డులు పంపిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పలాస : పోస్టుకార్డులను చూపిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నార్త్ బ్రేక్ వాటర్ పనులను పరిశీలిస్తున్న వై.వి సుబ్బారెడ్డి, మంత్రులు

# పోర్టుతో మారనున్న జిల్లా రూపురేఖలు

## రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - నౌపడ

వైసిపి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చూపించేందుకే ప్రాజెక్టులు పర్యటన చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ ప్రగతిని ప్రజాప్రతినిధుల బృందం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, పోర్టు ఇంజినీర్లతో కలిసి గురువారం పరిశీలించింది. ముందుగా నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని గత ప్రభుత్వం వినియోగించుకోలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు పోర్టులు ఉండగా మరో మూడు పోర్టులను వైసిపి ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ఈ పోర్టుల నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 75 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మూడు, నాలుగు నెలల్లో మూలపేట పోర్టులో ఓడలు ట్రయల్ రన్ చేసి, 2025 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. మూలపేట పోర్టులో నార్త్ బ్రేక్ వాటర్ పనులు 2,400 మీటర్లు కాగా ఇప్పటికే 1300 మీటర్ల వరకు పూర్తి చేశామన్నారు. బెర్తు నిర్మాణం కోసం ఫైలింగ్, డ్రెజ్జింగ్ పనులను త్వరలోనే చేపడతామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న మూడు పోర్టులతో ఏడాదికి 120-130 మిలియన్ టన్నుల సామర్థ్యం వరకు పెరుగుతుందన్నారు.

ఒక్క మూలపేట పోర్టుతోనే 80 మిలియన్ టన్నుల సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. చంద్రబాబు నాయుడు అమరావతి పేరుతో కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే లబ్ధి చేకూర్చేందుకు స్వార్థపూరితంగా ప్రయత్నించారని విమర్శించారు. భవిష్యత్‌లో శ్రీకాకుళం జిల్లా విశాఖపట్నంతో పోటీ పడే పరిస్థితి వస్తుందన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నందున టిడిపి అబద్దాలు ప్రచారం చేసి, మోసం చేసే పరిస్థితి ఉందని ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ టిడిపి హయాంలో ఉత్తరాంధ్రలో అభివృద్ధి చేసిన ప్రాజెక్టు ఏమిటో తెలియజేసి ఫొటో పెట్టాలని లోకేష్‌కు సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, వరుదు కళ్యాణి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## డిఆర్‌ఎంను కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస, కోటబొమ్మాళి

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌ను కోరారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా శ్రీకాకుళం రోడ్డు, హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్లకు గురువారం వచ్చిన డిఆర్‌ఎంను ఎంపీ కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆమదాలవలస గేటు వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం నుంచి అవతల ఎంపిడిఒ కార్యాలయం వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఊసవానిపేట వద్ద ఉన్న రైల్వే గేటుతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, అక్కడా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ఈ పనులకు అంచనాలను రూపొందించి అందజేస్తే రైల్వే మంత్రిత్వ శాఖతో మాట్లాడి అనుమతులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని డిఆర్‌ఎంకు తెలిపారు. విశాఖపట్నం నుంచి బరంపురం వరకు జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ హరిశ్చంద్రపురం అని, ఇక్కడ సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగా ఉన్నాయని ఎంపీ వివరించారు. దీనిపై డిఆర్‌ఎం స్పందిస్తూ తన పరిధిలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానన్నారు. హరిశ్చంద్రపురంలో రూ.1.50 కోట్లతో మంజూరు చేసిన నడక వంతెన భూమిపూజ పనులను సంక్రాంతిలోగా ప్రారంభిస్తామన్నారు. అప్రోచ్ రోడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు, రెండో నంబరు ప్లాట్‌ఫారంపై అదనపు బుకింగ్ కౌంటర్ వంటి మౌలిక సదుపాయాలను ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద చేపడతామని చెప్పారు. గుణుపూర్ పాసింజర్ రైలు, విశాఖ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ తన పరిధిలో లేదని, రైల్వే బోర్డుకు సిఫారు చేస్తానని హామీనిచ్చారు. రైల్వేస్టేషన్ పరిధిలోని 50 ఎకరాల్లో వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం ఎ.కె గుప్తా, రైల్వేస్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శివశంకర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

## ఓటర్ల జాబితాలో లోపాలకు తావీయొద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలు సజావుగా జరగాలంటే సక్రమమైన ఓటర్ల జాబితా అవసరమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులపై ఉందన్నారు. నగరంలోని ప్రజాసదన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. అర్హుల ఓట్లను తొలగించడం ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం నేరమే అవుతుందన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు సరిచేసి, సక్రమమైన ఓటర్ల జాబితా తయారు చేయడం కోసమే ఎన్నికల కమిషన్ జనవరి 12 వరకు గడువు పెంచిందని తెలిపారు.

శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లోని 2,048 పోలింగ్ కేంద్రాల్లో 16,14,999 ఓటర్లు ఉన్నారని వివరించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని గాతలవలస, మబుగాం, మత్స్యకార గ్రామాల్లో తాత్కాలిక వలస వెళ్లిన ఓటర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. పోలాకి మండలంలో చేర్పులు, తొలగింపులపై మరోసారి విచారణ చేసి అర్హులను ఓటర్ల జాబితాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు పాల్గొన్నారు.

# విఆర్‌ఎల నిరసన దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గౌరవ వేతనం పేరుతో ఏళ్ల తరబడి విఆర్‌ఎలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యనారాయణ విమర్శించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన విఆర్‌ఎలు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పోరాడి సాధించుకున్న డిఎను 2018 నుంచి వారి వేతనాల్లో రికవరీ చేయడం అన్యాయమన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే అన్ని సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి మాట్లాడుతూ విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి విఆర్‌ఒ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా 30 శాతం ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. గతంలో రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలని, పనిచేస్తూ మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షకు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.వాగ్దేవి, టిడిపి నాయకులు గొండు శంకర్ సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. దీక్షలో విఆర్‌ఎల సంఘ నాయకులు ఎన్.సీతప్పడు, కె.జనార్ధనరావు, బి.అప్పారావు, రాములమ్మ, మీనాక్షి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- చెవిలో పువ్వులతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించిన గోవిందరావు మాట్లాడుతూ మున్సిపల్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. జిఒ నంబరు 7ప్రకారం క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద నగరపాలక సంస్థ అధికారులు ఆర్‌టిసి డ్రైవర్లతో వాహనాలు తీసేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు అడ్డుకున్నారు. ఇచ్ఛాపురంలో మున్సిపల్ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. పలాసలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు అక్కడ్నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురుగన్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో సమ్మె శిబిరంలో యూనియన్ నాయకులు టి.సంతోష్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న గోవిందరావు

# తెప్ప బోల్తా : మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సముద్రంలో తెప్ప బోల్తా పడడంతో కొత్తపేటకు చెందిన మత్స్యకారుడు గుంటు ఎర్రయ్య (58) గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మృతుడు, అదే గ్రామానికి చెందిన కొండ పున్నయ్య, వంక లింగరాజు తెప్పపై సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. బయలుదేరిన 20 నిమిషాలకే అలల ధాటికి కావడంతో తెప్ప అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఎర్రయ్య సముద్రంలో పడిపోయాడు. మిగిలిన ఇద్దరూ ఎర్రయ్యను తెప్పలోకి చేర్చి సపర్యలు చేశారు. కెరటాల దెబ్బకు సొమ్మసిల్లిన ఎర్రయ్య కాసేపటికి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని సముద్ర ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతునికి భార్య గౌరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలందరికీ వివాహమైంది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మధుసూదనరావు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రయ్య మృతదేహం

# పెరిగిన పోరాటాలు... నిర్బంధాలు

- పారిశ్రామిక రంగంలో కనిపించని ప్రగతి
- కొత్తగా ఒక్క పరిశ్రమా రాని వైనం
- హామీ అమలుకు సమ్మెకు దిగిన పలు రంగాల కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం, యాజమాన్యాల తీరుకు నిరసనగా గతేడాది కాలంలో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక రూపాల్లో పోరాటాలు సాగించారు. కార్మిక చట్టాల అమలు, కనీస వేతనాలు, కార్మికులు పోరు సాగిస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రధానంగా సిపిఎస్ రద్దు కోసం అలుపెరగని పోరాటం సాగిస్తూనే ఉన్నారు. స్కీం వర్కర్లు పలుమార్లు ధర్నాలు, వంటావార్పు వంటి కార్యక్రమాలతో తమ నిరసన తెలుపుతునే ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో కొన్ని ప్రభుత్వశాఖలకు సంబంధించిన కార్మికులు, ఉద్యోగులు ఏడాది చివరిలో సమ్మెకు సైతం సిద్ధమయ్యారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు కోసం ఛలో అమరావతి, ఛలో కలెక్టరేట్‌తో తమ సత్తా చాటారు. ధర్నాలు, నిరసన ప్రదర్శనలకు పిలుపిస్తే చాలు ప్రభుత్వం వారిపై నిర్బంధ కాండ ప్రదర్శించింది.

కార్మికులపై యాజమాన్యాల వైఖరి మారకపోవడంతో ఈ సంవత్సరం పారిశ్రామిక రంగ కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. రణస్థలం మండలం బంటుపల్లిలో యునైటెడ్ బ్రెవరీస్ యాజమాన్యం ప్రభుత్వం మద్యం ఆర్డర్లను తగ్గించిందనే పేరుతో పనిదినాలు తగ్గించేసింది. కొంతమందిని పనుల్లో నుంచి తొలగించింది. కార్మికులతో కలిసి సిఐటియు వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహించడంతో యాజమాన్యం తొలగింపు ప్రక్రియ ఆపింది. తమ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల అమలు కోసం గతేడాది కాలంలో స్కీం వర్కర్లు అనేక రూపాల్లో ఆందోళనలు చేశారు. ఛలో కలెక్టరేట్, వంటావార్పు, 36 గంటల దీక్ష కార్యక్రమాలతో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మె సైరన్ మోగించారు.

### అంతా సమ్మెబాట

చాలీచాలని వేతనాలు, ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగంతో నెట్టుకొస్తున్న పలురకాల కార్మికులు ఏడాది చివరిలో ఒకేసారి ప్రభుత్వంపై గళమెత్తారు. వీరిలో ప్రధానంగా ఉన్న అంగన్వాడీలు ఉన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యలపై ఈ నెల 11న సమ్మె ప్రారంభించారు. ఎంఎల్‌ఎల ఇళ్ల ముట్టడి, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా, జలదీక్ష వంటి కార్యక్రమాలతో హోరెత్తిస్తున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు సాగించినా అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షతో తమ సమ్మె కొనసాగిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ కార్మికులు ఏడాదిలో రెండోసారి ఈ నెల 27న సమ్మెకు దిగారు. మరోవైపు విఒఎలు, ఆశావర్కర్లు సమ్మెబాట పట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం సమ్మెకు దిగారు.

### పారిశ్రామికరంగంలో కనిపించని ప్రగతి

జిల్లాలో 2023లో పారిశ్రామికంగా పెద్దగా పురోగతి కనిపించలేదు. అడపాదడపా పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చినా పట్టాలెక్కలేదు. పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వం చెప్తున్నా జిల్లాకు పెద్దగా వచ్చిన పరిశ్రమలుగాని, కార్మికులకు అదనంగా ఉపాధి కల్పించిన దాఖలాలుగాని లేవు. పరిశ్రమలకు కావాల్సిన అనుమతులు వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. భూసేకరణ, ఇతర సమస్యలు లేకపోలేదు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు నిరాశే మిగులుతోంది. మరోవైపు ముడి సరుకులు, విద్యుత్ నిర్వహణ భారంతో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు జిల్లాకు రాకపోవడం, ఉన్నవి మూతపడటంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. కార్మికులు ఉపాధి అంటే ఎంత సేపూ భావనపాడు పోర్టు నిర్మాణమంటూ పాలకుల ఊరింపే మిగిలింది.

### శ్రీకాకుళంలో సిఐటియు జాతీయ సెమినార్

శ్రీకాకుళం నగరంలో స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో డిసెంబర్ 2 నుంచి రెండు రోజులు పాటు సిఐటియు జాతీయ సెమినార్ నిర్వహించారు. సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యన్నారాయణ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా నిర్వహించనున్న సదస్సుకు సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డా కె.హేమలత ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడి-పరిష్కారాలు అంశంపై ప్రసంగించారు. ఆమెతో పాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు వక్తలుగా మాట్లాడారు.

### పెరిగిన నిర్బంధం

ఉద్యమాలతో పాటు ఈ ఏడాది కాలంలో తీవ్ర నిర్బంధం పెరిగింది. ఆందోళనలకు పిలుపు నివ్వడమే తరువాయి ఉద్యమాలను అణిచి వేసేందుకు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. సిఐటియు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన నాయకుల ఇళ్లకు వెళ్లి వారిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అరెస్టులకు, కేసులకు లెక్కేలేదు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉపాధ్యాయులను, ఉద్యోగులను అరెస్టు చేయించింది. పాఠశాలలకు వెళ్లి మరీ పోలీసులతో నోటీసులు ఇచ్చి వారిని ఆందోళనలకు రానీయకుండా కట్టడి చేసింది. ప్రభుత్వం ఒకపక్క అరెస్టులు, కేసులతో భయపెట్టాలని చూసినా ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు కొనసాగించారు.

**మహారాజ శ్రీ పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు**
**O.S 27/2021**

M.V. రమణ మూర్తి ..వాది
మరియు: బమ్మిడి. వినయ్ వగైరాలు ..ప్రతివాదులు

**నోటీసు**

To, D-2: బమ్మిడి. కృష్ణవేణి, W/o వినయ్. R/o. మండపాలెం కాలనీ, మెయిన్ రోడ్డు, టెక్కలి.

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీ హాజరు కొరకు శ్రీ కోర్టు వారు రిజిస్ట్రారు పోస్ట్ మరియు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ఉద్దేశ్య పూర్వకంగా పుచ్చుకోకుండా తప్పించుకుంటూ ఉన్నారు. గాన మీ హాజరు కొరకు పై కోర్టు వారు పై **దావాను తే 02-01-2024 దీన వాయిదా** వేసి ఈ పేపరు ప్రకటన మూలంగా నోటీసులు జారీ చేసియున్నారు. కావున పైన తెలిపిన **తే 02-01-2024 దీన ఉ॥ గం: 10:30 ని లకు** మీరు పై కోర్టు నందు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని పక్షమున దావా విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

B.K.R. పట్నాయక్
BANK ADVOCATE,
NEW COLONY , KASIBUGGA,
CELL: 9346841672

**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, టెక్కలి.**
**E.P. 15/2008 in O.S. 64/1999**

Between: వనజంగి వనజాక్షి. ...D.Hr
And:
వనజంగి రామశంకరరావు (died) ...J.Dr's

To:
J.Dr's No. 2 to 6, J.Dr.2: వనజంగి హారమ్మ, W/o రామశంకరరావు, J.Dr.2 వనజంగి విష్ణు కుమార్, J.Dr.4 వనజంగి యుదష్టర్ కుమార్, J.Dr.5: వనజంగి గిరిధరరావు, J.Dr.6 వనజంగి ఈశ్వర రావు.

పై నెంబర్ అమలు పిటిషన్ లో J.Dr.2to6 గల ఆస్తి, శ్రీకాకుళం జిల్లా, మెళియాపుట్టి మండలంలో, పెద్దలక్ష్మీపురం గ్రామములో పడమర శ్రేణిలోని, పెద్దవీధిలో డాబా ఇల్లు Door No: 1-41, వరుస సంఖ్య: 45, తూ.ప.6 మూరలు, (9 అడుగులు), ఉ.ద. 100 మూరలు (150 అడుగులు), తూర్పునకు: రుంకు కురమయ్య డాబా ఇల్లు, దక్షిణమునకు: షెడ్యూల్ ప్రకారం, శివ కోవెల, చెరువు రాజమార్గము, రోడ్ రాజమార్గము గ్రామకంటము కలదు. పశ్చిమమునకు: వనజంగి హారమ్మ, W/o వాసుదేవరావు డాబా ఇల్లు, ఉత్తరమునకు: షెడ్యూల్ ప్రకారం రోడ్ రాజమార్గము గ్రామకంటము ఉన్నది, శివకోవెల, చెరువు పొలాలు కలవు.

పైన పేర్కొనబడిన హద్దులు మధ్య గల డాబా ఇల్లు తేది: 11-01-2024న ఉదయం 10:30 గంటల నుండి 5:00 గంటలలోగా జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, టెక్కలిలో వేలం వేయబడును.

టెక్కలి,
తేది:28-12.2023

సంజీవి ధర్మరాజు
D.Hr. తరుపున న్యాయవాది,
టెక్కలి.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

## న్యాయవాదుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27/2023ను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కణితి విజయలక్ష్మి భాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నుంచి న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూహక్కు చట్టం జిఒ నెంబర్ 512 న్యాయవాదులకు గొడ్డలి పెట్టన్నారు. ఈ చట్టంతో ప్రజల భూములు, స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి రాజకీయ దళారులకు అప్పగించడమే ఈ యాక్ట్ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అనంతరం ఈ ర్యాలీ పట్టణంలో మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొనసాగించి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి కణితి విజయలక్ష్మి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించి రీసర్వే డిటి ఎస్.కిరణ్‌కుమార్‌కు న్యాయవాదులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కిల్లి మార్కండేయులు, పైడి వరాహ నరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు, కింతలి త్రినాథరావు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం

### డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- పొందూరు

పట్టు పరిశ్రమతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.వి.చిట్టిరాజు అన్నారు. మండలం మలకాంలో గురువారం సెరికల్చర్ షెడ్‌లను, మల్బరీ ప్లాంటేషన్ పరిశీలించారు. గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ నిధులతో రైతులు చేపడుతున్న మల్బరీసాగును, పట్టుపురుగుల పెంపకం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సెరికల్చర్ విభాగ అధికారి టి.రాజేంద్రప్రసాద్, సెరికల్చర్ సాంకేతిక విభాగ అధికారి సిహెచ్ కె.రత్నకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్లాంటేషన్ విభాగ అధికారి శ్యామల, ఎంపిడిఒ ఎస్.హరిహరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఇసి సందీప్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ బాక్సింగ్ పోటీలకు గేయామృత

ప్రజాశక్తి- టెక్కలి

ఎంపికైన గేయామృత

చండీగర్ యూనివర్సిటీలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరగనున్న ఆల్‌ఇండియా సౌత్ వెస్ట్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో టెక్కలికి చెందిన బొడ్డ గేయామృత పాల్గొనున్నారని కరాటే అకాడమీ శిక్షకులు నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 66 కిలోల మహిళా విభాగంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో జరగనున్న పోటీలకు గేయామృత ఎంపిక కావడంపై జిల్లా క్రీడాశాఖాదికారి డాక్టర్ కె.శ్రీధర్, శిక్షకులు నర్సిపురం శేఖర్‌లు అభినందించారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల భిక్షాటన

భిక్షాటన చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు తొమ్మిదోరోజు ఆందోళన కొనసాగించారు. నిరవధిక సమ్మెలో భాగంగా నగరంలో ఎన్‌జిఒ హోమ్ ఆవరణ నుంచి పాతబస్టాండ్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి ప్రాంతాల్లో గురువారం భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం పొట్టి శ్రీరాములు కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు మురళీకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఉద్యోగుల గోడు చెవిన పడేంతవరకు ఐక్యతతో ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. భిక్షాటన ద్వారా ఉద్యోగుల ఆకలి మంటలను ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. సిఎం పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం నగరంలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమ్మె శిబిరం వద్దకు చేరుకుని నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి. తవిటి నాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసరావు, యుగంధర్, గిరిధర్, రామకృష్ణ, వైకుంఠరావు, కార్యవర్గ సభ్యులు అరుంధతి, చంద్రకళ, విమల కుమారి పాల్గొన్నారు.

### డిమాండ్లు నెరవేర్చాలి

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తగుచర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి వినతిపత్రం పంపాలని యుటిఎఫ్ నాయకులు సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్‌ను కోరారు. గురువారం సాయంత్రం సమగ్ర శిక్ష కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ నేతృత్వాన రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వాగ్దేవి, జిల్లా కార్యదర్శి జి.సురేష్, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య, కె.సురేష్ కుమార్‌లు హాజరై వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటు సమ్మెలో భాగస్వాములవుతున్న కెజిబివి సిబ్బందిపై చర్య తీసుకుంటామంటూ జిసిడిఒ బెదిరింపులకు గురి చేస్తున్నారని ప్రస్తావించారు. ఆమె వాయిస్ మెసేజ్‌లపై

ఎపిసితో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జిసిడిఒ వైఖరి మార్చుకోవాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో సహకరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ అండదండలు ఉంటాయని, వారి సమస్యల కోసం అవసరమైతే ఉపాధ్యాయులు కూడా పోరాటాల్లోకి వస్తారని హెచ్చరించారు. వెంటనే సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు.

## విలేకరి ఆత్మహత్య

ప్రజాశక్తి- రణస్థలం, రూరల్

రామోదరరావు (ఫైల్)

లావేరు మండలం లావేటిపాలెం గ్రామానికి చెందిన ఒక పత్రిక విలేకరి గురజాపు దామోదరరావు (44) మండలంలోని సీతంవలస సమీపంలోని జీడితోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. బుధవారం జె.ఆర్.పురం, లావేరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం జీడితోట సమీపంలో దామోదరరావు ద్విచక్ర వాహనాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి తోటలో మృతదేహాన్ని గుర్తించారు. పక్కనే డ్రింక్ బాటిల్‌తో పాటు పురుగుల మందు డబ్బా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ డి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, మృతడి జేబులో లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం సాగుతుంది. అందులో వివరాలను మాత్రం పోలీసులు వెల్లడించలేదు. లేఖలోని వివరాలు బయటపెట్టాలని, అప్పటివరకు మృతదేహాన్ని తరలించడానికి వీల్లేదని భీష్మించుకుని కూర్చున్నారు. పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు మొబైల్‌లో లేఖను చూపించడంతో శాంతించారు. అందులో తన చావుకు ఎమ్మెల్యే, మండల నాయకుడు గోపి కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని రాసి ఉన్నట్లు ప్రచారం సాగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ దీనిపై వివరణ ఇచ్చారు. రాజకీయ కక్షతో తనపై బురద చల్లుతున్నారని అన్నారు. మృతుడు కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నట్టు తనకు తెలిసిందన్నారు. దీనిపై పలుమార్లు అడిగినా ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. ఈ ఆత్మహత్యపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి, వాస్తవాలను బయటపెట్టాలని కోరారు.

## జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- మందస

జీడి పంటకు మద్దతు ధరపై ప్రభుత్వ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు అధ్యక్షతన రట్టి, బేతాలపురం, మర్రిపాడు గ్రామాల్లో జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే 80 కిలోల జీడి పంటను బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి జీడి పరిశ్రమలకు సరఫరా చేయాలన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో ఇప్పటివరకు జీడి పూత రాకపోవడంతో రైతులు సంక్షోభంలో ఉన్నారన్నారు. ఎరువులు, పురుగు

మాట్లాడుతున్న మాధవరావు

మందులు పెట్టుబడులు పెరుగుతు న్నాయని అన్నారు. ప్రభుత్వం విదేశీ జీడి పిక్కలను స్వదేశీ పిక్కలు పూర్తయ్యేంతవరకు దిగుమతికి అనుమతించరాదని కోరారు. సమావేశంలో వెంకటరావు, దాలయ్య, కృష్ణారావు, మోహనరావు, భగీరథ, బాలయ్య పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పలాస 132 కెవి సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు నిమిత్తం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. ఈ విషయాన్ని పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సొంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

**మెళియాపుట్టి :** విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెళియాపుట్టి సబ్‌స్టేషన్ పరిధిలో మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, పెద్దలక్ష్మీపురం, జోడూరు, జాడుపల్లి, పెద్దపద్మాపురం గ్రామాల్లో మరమ్మత్తులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అంగన్వాడీల విధులు పాఠశాలకు బదలాయించొద్దు

ప్రజాశక్తి- నందిగాం

అంగన్వాడీల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహార పంపిణీ పాఠశాలలకు ప్రభుత్వం బదలాయించడంపై యుటిఎఫ్ వ్యతిరేకిందని జిల్లా కార్యదర్శి బి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అది పాఠశాలల ఉపాధ్యాయుల విధులు కావని, కలెక్టర్ అందజేసిన మౌఖిక ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని కోరారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఇది సరైన మార్గం కాదని అన్నారు. అదనపు పనులు అప్పగించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మండల ప్రతినిధులు, కుమారస్వామి, గణపతిరావులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ఎఎంసి నిధులు ఇవ్వాలి

మాట్లాడుతున్న ప్రసాదరావు

**కోటబొమ్మాళి:** వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మళ్లించే విధంగా ప్రత్యేక జిఒను ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. స్థానిక ఎఎంసి కమిటీ అధ్యక్షులు సుగ్గు పుణ్యవతి నేతృత్వంలో కార్యదర్శి వి.ఎస్.వి.ఆర్.ప్రసాదరావు గురువారం కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ఎఎంసికి రవాణా, వ్యవసాయ ఉత్పత్తులపై, అక్రమ రవాణాలపై వేసిన జరిమానాలు, రైస్ మిల్లుల చెస్‌ల ద్వారా వసూళ్లు చేసిన నిల్వ రూ.9.50 కోట్లు ఉందని అన్నారు. అయితే ఇది కేవలం ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాలు ఈ ప్రాంగణంలో నిర్మించే భవనాలకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉందని అన్నారు. ఈ నిధులు ఇతరాత్ర అవసరాలకు, అభివృద్ధి పనులు ఇచ్చేందుకు ఎటువంటి అధికారులు లేవని, అవసరమైతే అటువంటి జిఒలు ప్రభుత్వం నుంచి తీసుకురావాలని కార్యదర్శి వివరించారు. ఈ మేరకు కమిటీ స్పందిస్తూ... అయితే కమిటీలు ఎందుకని, ఏమి చేశామని ప్రజలకు సమాధానం చెప్పుకోవాలని చర్చించుకొని ఈ నిధులు గ్రామాల్లో లింకురోడ్డు, లింకు రోడ్ల మరమమ్మతులు, కాలువ పూడికల తీతలు, మదుముల మరమ్మతులకు ఉపయోగ పడేలా జిఒలు ఇవ్వాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ తీర్మాణాన్ని జనవరి మొదటి వారంలో ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుగ్గు రామిరెడ్డి, ఉపాధ్యక్షులు బొడ్డు వెంకటరమణమూర్తి, బాస్కరరెడ్డి, మెట్ట శాంతరావు, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న కాళీ సాహు

## రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు

**కవిటి:** ఆపద సమయంలో ఆదుకోవడమే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి తమ రక్తం కూడా దారబోసి పలువురు యువకులు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి పలువురికి ప్రాణదానం చేస్తున్నారు. ఆ కోవలోనే ఇచ్ఛాపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు అనే వ్యక్తికి మండలంలోని బొరివంకకు చెందిన కాళీ సాహు రక్తదానం చేసి ఆపద్బాంధవుడయ్యారు. ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న రాజుకు బి పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం తెలుసుకున్న కాళీ సాహు ఆస్పత్రికి చేరుకుని తన రక్తం అందించారు. ఈ సందర్భంగా కాళీ సాహు మాట్లాడుతూ తాను 9వ సారి రక్తదానం చేశానని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవ లక్ష్యమని అన్నారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజానీకం అభినందించారు.

## బెంతు ఒరియాల ఆందోళన

ప్రజాశక్తి- కవిటి

మానవహారం నిర్వహిస్తున్న బెంతు ఒరియాలు

తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరంతరం ఇక పోరాటం చేస్తామని నియోజకవర్గంలోని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ విద్యార్థులకు సిజిసి నంబరుతో కూడిన ధ్రువీకరణ పత్రం, బెంతు ఒరియాలకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతూ గురువారం కవిటిలో ఆందోళన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి బెంతు ఒరియాలకు అన్యాయం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ మానవహారం చేపట్టారు. అనంతరం కవిటి బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఇంచార్జి తహశీల్దార్ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బెంతు ఒరియా ప్రతినిధులు మాట్లాడుతూ దశాబ్దాలుగా అటు రాజకీయ నాయకులు, ఇటు ప్రజా ప్రతినిధులు తమ జాతిని మోసం చేస్తూ అన్యాయానికి గురిచేస్తున్నట్టు ఆరోపించారు. 1973 నుంచి 2003 వరకు తమకు ఎస్‌టి ధ్రువీకరణ పత్రం మంజూరు చేసేవారని, కానీ, తరువాత కాలంలో దాన్ని నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఒక గుర్తింపు లేని జాతిగా మిగిలిన బెంతు ఒరియాల విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు ఉన్నత ఉద్యోగాలూ కోల్పోతున్నట్టు తెలిపారు. సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెంతు ఒరియా ప్రతినిధులు సుమన్ బిసాయి, దుదిష్టి మజ్జి, బృందావన్ బిసాయి, శంకర్ సాహు, కృష్ణ బిసాయి, హరికృష్ణ బిసాయి, జైశన్ బిసాయి, ప్రేమ్‌సాహు పాల్గొన్నారు.

## తులసిపేట దళితుల ఆందోళన

**కోటబొమ్మాళి:** తప్పుడు సర్వే హద్దుల నివేదికలు ఇచ్చి దళితులపై దాడులకు కారకులైన మండల సర్వేయర్, చిట్టివలస గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని సమగ్రమైన సర్వే చేసి కొండ పోరంబోకు స్థలాన్ని కాపాడాలని దళిత హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం ముందు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యాన తులసిపేట దళితులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పాల పోలారావు మాట్లాడుతూ చిట్టివలస రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 198లో వండాన రాజేశ్వరమ్మ 0.42 1/2 సెంట్లు భూమి కొనుగోలు చేసి సాగు చేస్తున్నారని, అటువంటిది 0.89 సెంట్లు భూమికి ఎలా సర్వే హద్దులు నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఎదురుగా ఉన్న కొండ పోరంబోకు సర్వే నెం.196లో 0.37 1/2 సెంట్లు భూమి ఆక్రమణదారులకు ధారాదత్తం చేయుటకు కింది సాయి సిబ్బంది తప్పుడు నివేదికను అందిస్తే ఎటువంటి డాక్యుమెంట్స్ పరిశీలించకుండా హద్దులు నిర్ణయిస్తూ ఎండార్స్‌మెంట్ ఎలా మండల తహశీల్దార్ కార్యాలయ అధికారులు జారీ చేశారని అన్నారు. తనకు సంబంధం లేని కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిలో ఉన్న దళితుల పందులు షెడ్లు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు చిట్టి సింహాచలం, పంచాల శ్రీను, బమ్మిడి వేణుగోపాలు, దళిత సంఘాల ప్రతినిధి జి.చిరంజీవులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న దళితులు

మాట్లాడుతున్న గౌతు శిరీష

## టిడిపి గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి- మందస

రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మండలంలోని రాంపురం పంచాయతీలో గురువారం టిడిపి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు జి.కె.నాయుడు, భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, ముడిమించి నవీన్, సలిన మాధవరావు, జుత్తు అమ్మినాయుడు, కోడా తేజ, లక్ష్మణ పాల్గొన్నారు.

### టిడిపి నాయకులకు పరామర్శ

మండలంలోని శ్రీరామనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న సండుపల్లి తులసయ్య, చోక్కర ధర్మారావు, చొక్కర వల్లభరావు, జానికమ్మ కుటుంబాలను శిరీష పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడగి తెలుసుకున్నారు. ఎవరి ఏ సమయంలో అవసరం వచ్చినా నా దృష్టికి తీసుకొస్తే సహాయ సహకారాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

## సజ్జలను కలిసిన 'లోతుగెడ్డ'

**కొత్తూరు :** వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ పార్టీ సెంట్రల్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డిలనూ కలిశారు.

సజ్జలను కలిసిన తులసీవరప్రసాదరావు

## స్థల ఆక్రమణపై ఫిర్యాదు

**టెక్కలి :** పట్టణంలోని సంతోషిమాత ఆలయానికి ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన ఆక్రమణదారులను గురువారం తమపై దౌర్జాన్యానికి పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కిసాన్‌సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. సర్వే నంబరు 397లో కాంగ్రెస్ పార్టీకార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించారని అన్నారు. గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించడానికి వెళ్లిన సమయంలో స్థలం ఆక్రమణదారులు యాగాటి శివరావు అడ్డుకున్నారని అన్నారు. స్థలం దురాక్రమణపై గతంలో పలుమార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులుకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

## సరుబుజ్జిలిలో 'స్వచ్ఛభారత్'

**సరుబుజ్జిలి :** విద్యార్థులంతా సేవాభావాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా సామాజిక బాధ్యతను పెంచుకోవాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన గురువారం కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మానసిక పరిణితి సాధించి ఉత్తమమైన ఫలితాలు సాధించవచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు అన్నారు. అనంతరం కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి స్టడీ అవర్స్‌కు అనుకూలంగా మైదానం సిద్ధం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేంద్ర రామకృష్ణ, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్ రాజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తులసింగం, ఈదుపురం, బెళ్లపడ, లొద్దపుట్టి రైతు భరోసా కేంద్రాలు పనితీరును వ్యవసాయ సంచాలకులు జగన్మోహనరావు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎలా పనిచేస్తున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. బెళ్లపడలో నూర్పు చేస్తున్న రైతుల పొలంలోకి వెళ్లి తేమశాతం, జిపిఎస్ నావిగేషన్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ప్రతి రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురంలోని ఒక మిల్లు, కంచిలిలోని పలు మిల్లుల పరిధిలోని రైతులతో ఆర్‌బికెల్లో ట్యాగ్ చేసినట్టు వివరించారు. సాధారణ రకం క్వింటా రూ.2,183, గ్రేడ్-ఎ రకం రూ.2,203 ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న జగన్మోహనరావు

**పలాస :** ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రల వద్ద, రైస్ మిల్లులు వద్ద రైతులకు ఎటువంటి నష్టం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు పిఎసిఎస్ చైర్మన్ పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణలు ఆదేశించారు. మండలంలోని అల్లుకోల, లొద్దభద్ర రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రైతులు ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. వీరితో పాటు సిఇఒ తలస ముద్ర శ్రీనివాసరావు, విజయ్ కుమార్, విఆర్ఎలు మారుతి శ్రీనివాస్, ఎస్.ఇందు పాల్గొన్నారు.

## 108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి- మందస

మండలంలోని గోపాలసాయి గ్రామానికి చెందిన సవర పావని గురువారం 108 వావనంలో పండంటి ఆడ బిడ్డను జన్మించింది. పావనికు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా... మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఇఆర్‌సి వైద్యులు ప్రియ సలహాలతో 108 సిబ్బంది తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు, ఆశా వర్కర్ సుజన ప్రథమ చికిత్స నిర్వహించి ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

108 వాహనంలో ప్రసవించిన గర్భిణి

## ప్రయివేటు స్కూళ్ల నియోజకవర్గ అధ్యక్షులుగా తులసీదాస్‌రెడ్డి

తులసీదాస్‌రెడ్డి

**సోంపేట:** ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూళ్ల అసోసియేషన్ నియోజకవర్గ సంఘం అధ్యక్షులుగా ఇచ్ఛాపురం స్వర్ణభారతి విద్యా సంస్థల అధినేత చాట్ల తులసీ దాస్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం సోంపేట శ్రీనివాస విద్యానియం ఆవరణలో రాష్ట్ర, జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘ నాయకుల ఆధ్వర్యాన గురువారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నాయి. అధ్యక్షులుగా చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా కంచిలి విజ్ఞాన్ పాఠశాల యజమాని ఆదినారాయణ, కార్యదర్శిగా కె.రామారావు, ట్రెజరర్‌గా సోంపేట ఎస్‌కెపి పాఠశాలకు చెందిన బాలు పట్నాయక్, జాయింట్ సెక్రటరీగా కవిటి మండలానికి చెందిన దిలీప్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల ప్రయోజనం కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముద్దాడ రామ్మోహనరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ మెట్ట జనార్ధనరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తమ్మినేని సింహాచలం, రాష్ట్ర కార్య దర్శి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు గట్టి పాపా రావు, జిల్లా గౌరవ అధ్యక్షులు మామిడి సత్యనారాయణ, ఉత్తరాంధ్ర అధ్యక్షులు గణపతిరావు పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్


వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చంద్రబాబుతోనే ఆంధ్ర రాష్ట్రానికి భవిష్యత్ ఉందని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని అమలపాడు పంచాయతీలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష ఆదేశాల మేరకు గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి మేనిఫెస్టోతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా బాబుతోనే మన భవిష్యత్-మన రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ వైసిపి ప్రభుత్వం సర్వనాశనం చేసి భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దున్న షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందు పాపారావు, చింత నారాయణ, కారాడ సన్యాసి, దండు జోగారావు, వినయ్, దున్న కృష్ణమూర్తి, దివాకర్, దున్న రామినాయుడు, లింగరాజు, కర్ని నారాయణ, బేబీరావు, ఉమాపతి, కోదండ, ధర్మారావు పాల్గొన్నారు.

**పలాస :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 13, 21 వార్డుల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అనంతరం టిడిపి, జనసేన మేనిఫెస్టోతో ముద్రించిన పోస్టర్లను, ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు గోళ్ల చంద్రరావు, కొత్త సత్యం, నాలుగో వార్డు ఇన్‌ఛార్జి రామకృష్ణ పాల్గొన్నారు.


పలాస : పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

## గోప్యంగా తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ గోదాముల్లో విజయనగరం రీజనల్ మేనేజర్ బి.రవికుమార్ గోప్యంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం పారిశ్రామిక పార్క్ వద్దనున్న ప్రభుత్వ గిడ్డంగుల గోడౌన్-1, మార్కెట్‌యార్డ్ ఆవరణలో ఉన్న గిడ్డంగుల గోడౌన్-2లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోడౌన్‌ల్లో ఉన్న బియ్యం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులు ఆర్‌ఎంను పలు విషయాలపై వివరణ కోరగా ఆ సంస్కృతి తమ సంస్థలో లేదని అటువంటి కల్చర్ పౌరసరఫరాల సంస్థకు చెందుతుందని చెప్పడంతో అక్కడ ఉన్న వారంతా అవాక్కయ్యారు. పలుమార్లు పౌరసరఫరాల స్టాక్ పాయింట్ అధికారులు, రేషన్ డీలర్లు బియ్యం బస్తాల తూకంలో తేడాలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారని, గిడ్డంగుల సంస్థ ఆర్‌ఎంను ప్రశ్నించడానికి విలేకరులు ప్రయత్నించగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ తనిఖీల్లో స్థానిక గిడ్డంగుల సంస్థ మేనేజర్ యు.వేణు, సిబ్బంది ఉన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై శ్రద్ధ

ప్రజాశక్తి- పోలాకి

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం వైద్య శిబిరానికి హాజరయ్యే దీర్ఘకాలిక వ్యాధులైన డయాబెటిస్, హైపర్ టెన్షన్ రోగుల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని 'ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం' జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం.ప్రసాదరావు ఆదేశించారు. పోలాకి మండలం కె.పి.వలస సచివాలయ పరిధిలోని రాళ్లపాడులో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల రోగుల వివరాలు నమోదు విధానం అనంతరం వారికి పోస్టల్ ద్వారా మందులు పంపిణీ కార్యక్రమం చేపడుతామని అన్నారు. అందువల్ల ఎఫ్‌డిపి యాప్‌లో వివరాల నమోదు విషయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం రాళ్లపాడులో ఎస్‌సిడిసి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆశా కార్యకర్తలు రోజుకి 20 ఇళ్లు చొప్పున సర్వే చేస్తూ, ఇంటిలోని ప్రతి కుటుంబ సభ్యున్నీ పరీక్షించి, వివరాలు నమోదు చేయాలన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన పెంచడం ద్వారా మాత్రమే వ్యాధి నిర్మూలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమ, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిపి నీలవేణి

## రహదారుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామీణ ప్రాంతంలోని పరిసర గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తామని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. మండల పరిషత్ నిధులు రూ. 2.50 లక్షలతో గరుడభద్ర ఉన్నత పాఠశాల సమీపం నుంచి పల్లిసారథి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ రహదారులు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ రెండు గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారని అన్నారు. స్థానికుల కోరిక ఇన్నాళ్లకు తీరనుందని పేర్కొన్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో మండలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మంలో వైసిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు, కె.వాసు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత కాంగ్రెస్ వల్లే సాధ్యం

శ్రీకాకుళం అర్బన్ : కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న పరమేశ్వరరావు

**శ్రీకాకుళం అర్బన్ :** దేశ సమగ్రతను కాపాడడంలో కాంగ్రెస్ పాత్ర ఎంతో కీలకమని, స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి పాలన కొనసాగించినంత వరకు ఎన్నో మైలురాళ్లు దాటి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించింది కాంగ్రెస్ మాత్రమేనని జిల్లా అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్ ఆవరణలో గురువారం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి దేశంలో అభివృద్ధి, సంక్షేమం, రక్షణ కోసం కృషి చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, కృష్ణ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, దళిత విభాగం అధ్యక్షులు మధుసూదనరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి పాల్గొన్నారు.

**రణస్థలం రూరల్:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో 139వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మీ, కె.జోగినాయుడు, జగదీష్‌నాయుడు, ఎం.గణేష్, వై.సూర్యనారాయణ, ఎం.రమణ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : కేక్ కట్ చేస్తున్న సింహాద్రినాయుడు తదితరులు

**టెక్కలి :** సమాజంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆశాదీపంగా నుండేది కాంగ్రెస్ పార్టీ విధానాలేనని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం టెక్కలిలో నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సభ్యులు చింతాడ దిలీప్‌కుమార్, పట్టణ బాధ్యులు శాసుమహంతి ధర్మారావు, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల అధ్యక్షులు పప్పు జగ్గారావు, వెంకటరమణ, యాగాటి శ్రీరామ్ పాల్గొన్నారు.

# కేలండర్ల ఆవిష్కరణ

**కోటబొమ్మాళి:** మండల విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ కేలెండర్‌ను టెక్కలి ఉపవిద్యాశాఖ అధికారి పగడాలమ్మ, ఎంఇఒలు అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసుదేవరావు, నారాయణరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సింహాచలం, ఆనందరావు, ప్రతినిధులు గోవిందరావు, మన్మథ, కమలాబాయ్, రామమ్మ, ఉపేంద్ర, స్వర్ణలత పాల్గొన్నారు.

**ఎపిటిఎఫ్...**

**కవిటి:** ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారంలో ఎపిటిఎఫ్ సేవలు ఎనలేనివని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. ఎపిటిఎఫ్1938 2024 కేలండర్‌ను బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**డిటిఎఫ్...**

**పొందూరు:** మండలంలో తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.కంఠయ్య చేతులమీదుగా గురువారం డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) జిల్లా కేలండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో డిటిఎఫ్ ముందుంటుందని డిటిఎఫ్ మండల ప్రధానకార్యదర్శి గండెం రామారావు అన్నారు. కార్యక్రమంలో డిటిఎఫ్ సభ్యులు ఎం.అనంతబాట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పగడాలమ్మ

జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

## అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.బాలునాయక్ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో అర్చకులు శేషవస్త్రాన్ని కప్పారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. వారితో పాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు హాజరయ్యారు.

## ఎన్‌సిసి యూనిట్ మంజూరు

**రణస్థలం రూరల్:** మండలంలో బంటుపల్లి పంచాయతీ నడుకుదిటి పాలెంలో ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌యిఅ ఎన్‌సిసి యూనిట్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందని స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, డైరెక్టర్ తేజబాబు అన్నారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎన్ఇఆర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఒకకొత్త శకానికి ఈ పరిణామం నాంది పలుకుతుందన్నారు.

## జెండర్ వివక్షతపై ర్యాలీ

**టెక్కలి రూరల్:** జెండర్ వివక్షతపై మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం టెక్కలి కిల్లిపోలమ్మ ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దు... చదువే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎటిఎం గురువెల్లి నారాయణరావు, సిసిలు కె.పద్మావతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం

### స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందజేయడమే తన లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలం కనిమెట్ట, రాందాసుపురం, దళ్లవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల తాగునీటి అవసరాన్ని గుర్తించి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి పనులు ముమ్మరంగా సిఎం జగన్మోహన్ రెడ్డి చేపడుతున్నారని పేర్కొన్నారు. రామదాసుపురంలో రూ.26.70 లక్షలు, కనిమెట్టలో రూ.1.20 కోట్లు, దల్లవలసలో రూ.85లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాడాన సునీల్, వైస్ ఎంపిపి ప్రతినిధులు కాకర్ల రాజారావు, వండాన సూరపు నాయుడు, సర్పంచ్‌లు లక్ష్మి, రమణ, ఎంపిటిసి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు పాల్గొన్నారు.

దళ్లవలసలో ఇంటింటికీ కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

# ఆర్‌జివికి ధీటుగా సినిమా తీస్తా

### నిర్మాత నట్టి కుమార్

మాట్లాడుతున్న నట్టికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాంగోపాల్ వర్మ అందిస్తానన్న వ్యూహం సినిమా వస్తుందో లేదో గాని అందుకు భిన్నంగా తాను రాజకీయ ఇతివృత్తం గల సినిమాను తీస్తానని సినీ దర్శక, నిర్మాత నట్టికుమార్ తెలిపారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన ముందుగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం నగరంలో ఇప్పిలివారివీధిలో మాజీ సెన్సార్‌బోర్డు సభ్యులు ఇప్పిలి తిరుమలరావు స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సమిష్టి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఎంతో అవసరమన్నారు. రాజకీయాలకు సంబంధించి గతంలో అనేక సినిమాలు తీసిన అనుభవం ఉందని, టిడిపి, చంద్రబాబు అంటే తనకు అభిమానం ఉందన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి కక్షపూరితంగా చంద్రబాబును జైలుకు పంపించడం తనకు మానసికంగా బాధ కలిగించిందన్నారు. ప్రతిసారి ఎన్నికల ముందు సర్వేలు నిర్వహించడం తనకు ఎంతో ఆసక్తని, ఇప్పుడు రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో ఎవరి ప్రభావం ఎంత మేరకు ఉందో తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 8 స్థానాలు టిడిపి విజయం సాధిస్తుందన్నారు. ఆర్‌జివి వ్యూహం సినిమాను తీశారని, అంతమాత్రాన సినిమాలకు ప్రభావితమై రాజకీయంగా ఓట్లు వేస్తారనుకోవడం భ్రమేనన్నారు. తాను తీయబోయే సినిమా నేటి రాజకీయాలకు అద్దం పట్టేదిగా ఉంటుందన్నారు.

రోదిస్తున్న తల్లిదండ్రులు

## మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలి

**కంచిలి :** మండలంలోని భోగాబెని పంచాయతీ, జెన్నాగయికు చెందిన ఉమ్మిడి సింహాచలం (21) ఇటీవల ఇరాన్ వద్ద జరిగిన ఓడ ప్రమాదంలో మృతి చెందిన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకోవాలని తల్లిదండ్రులు సింహాచలం, రామయ్యలు ప్రభుత్వానికి గురువారం కోరారు. పెద్దవారైన ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, మరో యువతికి వివాహం కావాల్సి ఉందనే ఉద్దేశంతో సింహాచలం ఇంటర్మీడియట్ పూర్తి కాగానే, నెల రోజుల క్రితం రాజస్థాన్ చెందిన రుద్రాక్ష ప్రొఫెషనల్ కన్సల్టెన్సీ ట్రస్ట్ ద్వారా మర్చంట్ నేవిలో ఉద్యోగం సంపాదించాడు. మూడు రోజుల క్రితం ఇరాన్ నుంచి వెళ్లిన నౌకలో సింహాచలం విధులు నిర్వహిస్తున్నట్లు, ఆ ఓడ ప్రమాదానికి గురైనట్టు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం గ్రామస్తులకు తెలిసిందన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఇచ్ఛాపురం :** ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద సంఘం చైర్మన్ నర్తు నరేంద్రయాదవ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, సోంపేట జెడ్‌పిటిసి జోగారావు, పట్టణ అధ్యక్షుడు పట్నాయక్, మండల అధ్యక్షుడు పాతర్ల రాజశేఖరరెడ్డి, మండల వైస్ ఎంపిపి దువ్వ వివేకానందరెడ్డి, ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్. తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీనాం, కారింగ్ మోహనరావు, నర్తు భానోజీరావు, జోగల దిలీప్, పిలక సంతోష్ పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలూ అవసరమని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గురువారం తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక బలాన్నీ అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడపై కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, కోతి చిన్నారావు పాల్గొన్నారు.

## జనసేన నాయకుల పరామర్శ

**వజ్రపుకొత్తూరు :** వజ్రపుకొత్తూరు విలేకరి పల్లేటి మోహనరావు తల్లి బాపనమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు గురువారం పరామర్శించారు. మోహన్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో రెయ్యి అఖిల్, గొర్ల దినేష్‌కుమార్, కర్రి లక్ష్మణరావు ఉన్నారు.

## సముదాయాలను వినియోగించుకోవాలి

**టెక్కలి:** ఉపాధ్యాయులు తమ బోధనలో మెరుగైన మెలకువలను నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పాఠశాలల సముదాయాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిని గార పగడాలమ్మ అభిప్రాయపడ్డారు. పట్టణంలో బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మహత్మాజ్యోతీబాపూలే, బాలికల గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన సముదాయాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగు, గణితం, సామాన్య శాస్త్రల ఉపాధ్యాయులు సముదాయాల్లో పాల్గొన్నారు. సముదాయాల నిర్వహణ తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ ముందుగా నిర్ణయించిన కాలనిర్ణయపట్టిక ప్రకారం సముదాయాలు నిర్వహించాలని కోరారు. టెక్కలి, నందిగాం మండలాల్లో వివిధ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సిబ్బంది కుప్పిలి ప్రకాష్, కుప్పిలి నగేష్, బెనర్జీ పాల్గొన్నారు.

# బూర్జ మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- బూర్జ

బడ్జెట్ ఆమోదంతో సామాజిక సమానత్వం లభించి తద్వారా అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతుందని ఎంపిపి కర్నేన దీప అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఎంపిడిఒ రవిబాబు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలకు ఎంపిపి దీప, వైస్ ఎంపిపి బి.సూర్యారావు మిగిలిన సభ్యులంతా ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ బడ్జెట్ వల్ల పేదప్రజలకు చేయూత లభిస్తుందన్నారు. 2023-24 ఏడాదిలో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.26.55లక్షలు ఖర్చు చేసి మండల పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సామాజిక అభివృద్ధి, జీతభత్యాలు కలిపి రూ 1.12 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. 24-25 సంవత్సరానికి రూ.40.83కోట్లు ఆదాయం, రూ.39.79కోట్లు ఖర్చుకు ఆమోదం జరిగినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కార్యాలయ ఆవరణలో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీప

# మొక్కజొన్న సాగుతో అధికాదాయం

ప్రజాశక్తి- బూర్జ

వరిపంట కోసిన మడుల్లో ఎటువంటి దుక్కు లేకుండా జీరో టిల్లేజు పద్ధతిలో మొక్కజొన్న సాగు తక్కువ పెట్టుబడితో దిగుబడులు పొందవచ్చని మండల ఎఒ వి.రాజేశ్వరరావు తెలిపారు. గురువారం బూర్జలో గంగు రమేష్ సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్న సాగు మండలంలో సుమారు 100 ఎకరాలకు పెరిగిందన్నారు. మండలంలో బూర్జ, వావాం, మామిడివలస, కొల్లివలస, గంగంపేట, కాఖండ్యాం గ్రామాల్లో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రైవేట్ కంపెనీలు రైతులతో సంకర జాతి విత్తన ఉత్పత్తి కోసం ఒప్పందం చేసుకోవడం, మొక్కజొన్నకు కనీస మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం 50శాతం సాగు వ్యయంపై పెంచడంతో క్వింటా ధర 2,090 కాగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ రైతులకు సాంకేతిక, విత్తు యంత్రాలు ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. మొక్కజొన్న రైతులు విధిగా రబీ పంట కాలానికి ఇ- క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ వసంత, రెడ్డీస్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ ఏసుబాబు ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు